# 25. పల్లెకు పోదాం

"తమ్ముడు ఇల్లమ్మేస్తున్నానట్ట" అంది మాణిక్యం. చేతిలో ఉన్న కాఫీకప్పు నా కందించి సోఫాసెట్‌లో నాకెదురుగుండా ఉన్న విడికుర్చీలో కూచుంది.

'ఇల్లమ్మేసి ఎక్కడుంటాట్ట? క్వార్టర్సు బావులేదని ఇల్లు కట్టుకునీ కూడా ఇదేం ఆలోచన!' అన్నాను.

"ఢిల్లీలో ఇల్లు కాదు, అగ్రహారం లోది." లేచి టేబిల్ దాకా వెళ్ళి ఓ ఉత్తరం పట్టుకొచ్చింది. వెంటనే నాకిచ్చీకుండా చేత్తో పట్టుకుని మళ్ళా కూచుంది.

మా బావమరిది విశ్వనాథం ఢిల్లీలో రక్షణ మంత్రిత్వ శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. 1964లో ఐ.ఏ.ఎస్. కోసం పరీక్ష రాసేడు. సెలక్ట్ అయ్యేడు కానీ రేంకు రాలేదు. చిన్నస్థాయి అధికారిగా తీసుకుంటాం వస్తావా అన్నారు. చేరేడు. సర్వీస్‌లో చేరిన పదేళ్లదాకా తన జీతం లోంచి ఖర్చులు పోను మిగిలిందంతా పద్ధతిగా మా మామగారికి పంపేడు.

అప్పటికి మా మామగారికి 1956 చట్టానికి దొరక్కుండా తప్పించుకున్న భూమి ఆరెకరాల పల్లం, మూడెకరాల తోటా ఉన్నాయి. అర ఎకరం నివేశన స్థలంలో పది గదుల మండువా ఇల్లుండేది. ముగ్గు రాడపిల్లల్లో మా ఆవిడే చివరిది. పొలాల మీది రాబడిలో మిగిలిందానికి తను పంపిన డబ్బు చేర్చి పాతకాలం నాటి పెంకుటిల్లు పడగొట్టించి ఆరు గదుల డాబా ఇల్లు కట్టించుకున్నాడు విశ్వనాథం.

"రిటైరైపోయేక ఇక్కడి కొచ్చుండిపోతాను. కాలుష్యంలేని గాలి పీల్చుకుంటూ, చప్పుడుకీ తొందరకీ దూరంగా." అన్నాడు విశ్వనాథం; తన హయాంలో 1979లో జరిగిన గృహప్రవేశం నాడు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అన్నారు కద" అన్నాడు.

"నువ్వు రిటైరవడ మెప్పుడు, ఇక్కడికి రావడ మెప్పుడు!" అన్నాను. "ఇచ్ఛాపూర్వకమైన రిటైర్మెంటని ఒకటుంది కదా ఇప్పుడు! దానికింద ఇరవై రెండో, ఇరవై నాలుగో ఏళ్లు సర్వీసు పూర్తికాగానే ఒచ్చేస్తాను" అన్నాడు.

ఆ లెక్కని రెండేళ్ల కిందట ఒచ్చీవలసింది. ఒచ్చేడు కూడాను. కానీ, అగ్రహారంలో ఉండిపోడానికి రాలేదు. మా మామగారికి జబ్బు చేస్తే విశాఖపట్నం ఆస్పత్రిలో చేర్చిన సంగతి తెలిసి వొచ్చేడు. అతనొచ్చిన మర్నాడే మా మామగారు పోయారు. శవాన్ని టాక్సీలో వేసుకుని అగ్రహారం తీసికెళ్లి దహనపర్చి, పన్నెండు రోజుల కర్మ పూర్తిచేసి మరో పదిరోజులుండి వెళ్లేడు. మా ఒదినగార్లు, తోడల్లుళ్లు; పిల్లల్తో, మనవల్తో, మనవరాళ్లతో సహా వచ్చేరు. విశ్వనాథం భార్య సావిత్రి ఒచ్చింది గానీ కొడుకులిద్దరూ ఢిల్లీలోనే ఉండిపోయారు. కర్మకీ, ఆ పన్నెండు రోజులూ మేం అందరం అక్కడ వంటవాళ్లనీ, పనివాళ్లనీ, పురోహితుల్నీ పెట్టుకుని పెళ్లివార్లా గడిపినందుకూ; పదకొండువేలకి పైగా ఖర్చయింది. అది మొదలు: విశ్వనాథం తనుగా ఏదైనా అమ్మడానికి..."ముప్పయ్యయిదు మందిరి తేలేరు బాబూ, మేష్టారి కుటమానంతో కలిపి, సిన్నా పెద్దా అందరూని. పంతులుగోరి దర్జాకి తక్కవరాకంటా కర్మలూ సంతర్పన్లూ చేయించాలి గదా!" అని పాపయ్య పాత్రుడు పదివేల

రూపాయలు తెచ్చిచ్చేడు. "తరవాత లెక్క జూసుకుందార్లే బాబూ, తమ రెక్కడికి పోతారు, ముందు అవుసరం తీరాలి గదా'' అన్నాడు. పధ్నాలుగో రోజున పేటలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకి తీసికెళ్లి రెండెకరాల భూమికి క్రైచీటీ రాయించుకున్నాడు.

ఇలా ఢిల్లీ వెళ్లేడో లేదో అలా ఫోన్ చేసి చెప్పేడు, మేడమీద రొండు గదులూ, కిందని ఒకటీ ఏసీ చేయించుకోవలసొచ్చింది కనకానూ, పెద్దకొడుకు రీసెర్చి చైడానికి అమెరికాలో అవకాశం వచ్చింది కాబట్టి వాణ్ణి పంపాలి కనకానూ; డబ్బు కావాలని.

కిందటేడు రొండోవాడికి ఇంగ్లాండులో ఏదో అవకాశం వొచ్చింది. వాణ్ణీ పంపేడు. అలా అలా మిగిలిన పల్లం భూమిలో కొంతా, తోటలో కొంతా అమ్మేశాం. ఇంక మిగిలింది ఆ ఇల్లూ, పల్లం రెండెకరాలూ, ఎకరం తోటాను.

"పిల్లలిద్దరూ పై దేశాలకి వెళ్లిపోయేరు. పెళ్లిళ్లు చేసీసుకోర్రా అంటుంది సావిత్రి. మేం ఇండియా పిల్లల్నే చేసుకుంటాం; తెలుగు వాళ్ల అమ్మాయిల్నే చేసుకుంటాం. బెంగెట్టుకోకని ఇద్దరూ హామీలిచ్చేరు. కానీ పెద్దవాడు ఆదిత్య తను పెళ్లి చేసుకుంటే ఆ అమ్మాయిని వెంటబెట్టుకు పోతానే తప్పా అమెరికా వదిలి రావడం మాత్రం లేదంటున్నాడు. కుమారం ఒస్తే కూడా ఇక్కడే ఉండిపోతాడు కానీ పల్లెకి రాడు. ఇలాటప్పుడు అగ్రహారంలో నాకా ఇల్లూ పొలమూ ఎందుకు? బావగార్ని ఓసారి ఆ వూరు వెళ్లి పాపయ్య పాత్రుణ్ణీ, రంగరాజుగార్నీ కదిలించి చూడమని చెప్పు. అన్నీ కలిసి లక్షా అరవై వేలు చేస్తాయని నాలెక్క. ఇదంతా కూడా నేను తీసీసుకోను. నాన్నగారు నా ముగ్గురు అక్కల పెళ్లిళ్లు కట్నాలూ కానుకలూ ఇవ్వకుండానే చేసేరు. అంచేత ఈవొచ్చే డబ్బు ఎంతైతే అంతానూ, నాలుగు వొంతులు వేసి మూడువొంతులు మీ ముగ్గురికీ ఇచ్చేసి మిగిలిందే నేను తీసుకుంటాను. నా మట్టుకి నాకు ఏమనిపిస్తోందంటే ఈ ఆస్తి పైవాళ్లెవరో కొనుక్కునీ కంటేనూ మీ ముగ్గుర్లో ఎవరో ఒకరు కొనుక్కుంటే బావుణ్ణని. ఇల్లూ భూమీ కొనుక్కునే వాళ్ళకి ఇంట్లో ఉన్న సమస్త వస్తువులూ ఇచ్చీడానికి కూడా నా కభ్యంతరం లేదు. బేరం సెటిల్ చేసి ఫోన్ చేస్తే నేనొచ్చి సంతకాలు పెట్టేస్తాను."

ఉత్తరం చదువుతూ మధ్య మధ్య నేను మాణిక్యం వేపు చూసినప్పుడల్లా మా బావమరిది విశ్వనాథం చేసిన ప్రతిపాదన నేనే అందిపుచ్చుకోడానికి ఉత్సాహం చూపించి మాట్లాడతానేమో అన్న ఆశ కళ్లలో పెట్టుకుని నావేపు చూసింది. మా పెద్ద తోడల్లుడు గారికి రాజమండ్రిలో మెడికల్ షాపుంది. ఒక్కడే కొడుకు. వాడికి నలుగురు పిల్లలు. ఇప్పుడు వాళ్లకి మెడికల్ షాపుతో బాటు ఒక ఫర్నిచర్ షాపు కూడా ఉంది. షాపుల్లో రెండు ఫోన్లూ, ఇంట్లో ఒకటీ పెట్టించుకుని రాత్రనకా పగలనకా అలా వ్యాపారాలు చేస్తూనే ఉంటారు.

మా రెండో తోడల్లుడు గారు సెంట్రల్ ఎక్సయిజులో పనిచేసి సూపరెంటుగా రిటైరయి, నూజివీడు కాలేజీలో లెక్చరర్‌గా ఉన్న పెద్దకొడుకు దగ్గిర స్థిరపడ్డారు. ఇంకో కొడుకు డిఫెన్స్ ఎకౌంట్సులో పూనాలో ఉన్నాడు. కూతురికి పెళ్లయి కాపరానికి వెళ్లిపోయింది.

వాళ్లెవరూ కూడా ఈ ఆస్తి లక్షా అరవై వేలకి కాదు, కేవలం యాభైవేలకే ఇచ్చేస్తాం అన్నాకూడా ఏమీ ఉత్సాహం చూపించరు. విశ్వనాథం ఇస్తానంటున్న వాటా, నలభైవేలో ఎంతో; ఇస్తే పుచ్చుకుంటారేమో కాని; ఇమ్మని అడగరూ, ఇవ్వకపోతే ఏమీ అనుకోరు కూడాను. వాళ్లిద్దరూ నాకన్నా పెద్ద వాళ్లే కాక స్థితిమంతులు కూడాను.

ఇంక మిగిలింది నేనే. ముప్ఫయ్యేడేళ్లు ప్రభుత్వ సర్వీసులో ఈ జిల్లాలోనే పనిచేసి చిన్న ఉద్యోగంలో మొన్ననే రిటైరయ్యాను. మా అబ్బాయికీ, అమ్మాయికీ నా స్తోమతకి తగ్గట్టుగా పెళ్లిళ్లు చేసేను. కొడుకూ, కోడలూ బదలీలంటూ అసలుండని ఒక ప్రభుత్వరంగ సంస్థలో ఈ వూళ్లోనే పన్లు చేస్తున్నారు. అల్లుడు మున్సిపాలిటీలో ఇంజినీరింగు ఇనస్పెక్టరు. కూతురు అత్తారింట్లో వూరికే కూచోకుండా వీధిహాల్లో ఒక టైపు ఇన్‌స్టిట్యూటు పెట్టి నడుపుతోంది. మా అబ్బాయికి ఒక కూతురూ, ఒక కొడుకూ ఉన్నారు. ఒక నెల రోజుల్లో నా పెన్షను కమ్యుటేషను, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండూ కలిపి రెండు లక్షల పదివేలదాకా నా చేతికి అందుతుంది.

"తమ్ముడు లక్షా అరవై వేలంటున్నాడు కదా. అందులో నలభై వేలు నా వాటా ఇస్తానంటు న్నాడు కదా. ఆ లెక్కని మనకి లక్షా ఇరవై వేలకే ఆ ఇల్లూ, పొలమూ, తోటా ఒస్తాయి. అటూ ఇటూ చూసి లక్షే ఇస్తానన్నా కూడా తమ్ముడేమీ అనుకోడు. మిగిలిన లక్ష రూపాయలూ బేంకులో వేసేసి మనం అగ్రహారం వెళ్లిపోవచ్చును." అంది మాణిక్యం.

"నీకేం మతిగానీ పోయిందేమిటి?" అన్నాను.

"నాకు మతంటూ ఉంటేగదా పోడానికి?"

"ఈ వయస్సులో కొడుకునీ, కోడల్నీ, మనవల్నీ కనిపెట్టుకునుండాలి గానీ వేరెళ్లిపోతానంటా వేంటి?"

"వాళ్లు మన్ని చూస్తే కదా, మనకి వాళ్లని చూడాల్సుండడం?"

"అంటే?"

"చెప్పమంటారా?"

"చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది?"

"చెప్తాను వినండి. తెల్లార్లేచింది మొదలూ. నలుగురూ స్తానాలు చైడం, పిల్లల్ని బళ్లకి సిద్ధం చైడం- దీనికే సరిపోతుంది. తొమ్మిది కొట్టగానే ఇంత ఫలహారం నోట్లోనూ, గిన్నిలోనూ సర్దీసుకుని తుర్రుమని మోటర్ సైకిలెక్కేసి పారిపోతారు. నాలుగున్నరకి అట్నించి వాళ్లూ, ఇట్నించి వీళ్లూ ఇల్లు చేరుతారన్న మాటేగాని మనిద్దర్నీ చచ్చేవా బతికేవా అని పలకరిస్తున్నారా? పిల్లలు బళ్లో చదివింది వొంటపట్టిందా లేదా అని మళ్లా ఇక్కడ బడి పెడతారు. ఆ చదువులేమిటో, ఆ రాతలేమిటో రాత్రి ఎనిమిదిన్నరయ్యేవరకూ ఆ లోకమే వేరు. అప్పుడు అడుతుం బుడుతుమ్మని ఒంటిమీద నాలుగు చెంబుల నీళ్లు పోసుకుంటే పోసుకున్నట్టూ, లేకపోతే లేనట్టూ కంచాల దగ్గిర చేర్తారు. చూస్తే కొంచెంసేపు ఆ డొక్కుమీదొచ్చే బొమ్మలు చూస్తారు. లేకపోతే హా-యని ఆవలించు కుంటూ పక్కలెక్కేస్తారు. ఆదివారం నాడో, సెలవనాడో, పండుగ నాడో అయినా వాళ్లకి ఊళ్లో పెత్తనాలు చెయ్యడానికేమీ లేకపోతే గదా మీ మొహం, నా మొహం చూస్తున్నారు! ఇంట్లో పాలెలా ఒస్తున్నాయి. నీళ్లెలా ఒస్తున్నాయి, కూరా నారా ఏమిటి, ఇవాళ ఇడ్డెన్లే ఎందుకు చేసుకున్నాం. ఈ నెయ్యేమిటి ఇలాటి వాసన వేస్తోంది. ఈ కూర ఆవాపిండీ పెట్టి ఎందుకొండుకున్నాం? పులుసూ బెల్లం పెట్టి ఎందుకొండుకోలేదు? ఈ పచ్చడి ఇంత రుచిగా ఉన్నాదంటే దీనికి పడ్డ పాటెంత? ఆ మిషిన్లో పెట్టి గిర్రుమని తిప్పేసి ఉతికిన బట్టలు చలవచేసే చాకలాడెలా ఉంటాడు? పనిమనిషికి జీతం ఇచ్చి వూరుకుంటున్నారు, ఎప్పుడేనా చేతులారా ఇంత అన్నం పెడుతున్నారా, మనింటికి ఇరుగు నెవరున్నారు, పొరుగు నెవరున్నారు - ఇలా ఏమీ తెలీకుండా మిల్లుల్లా పనిచేస్తూ నల్లుల్లా బతికేస్తూ

ఎంతో సుఖంగా ఉన్నాం అని మురిసిపోయే ఈ అపేక్ష ఉంటేనేం, ఊడితేనేం అని మీకెప్పుడూ అనిపించలేదుటండీ?" మాణిక్యానికి కాదు, నాకే మతిపోయినట్టయి మాట రాలేదు, నోటంట.

"పోనీ ఉన్న ఒక్క ఆడపిల్లనీ ఏ దూర దేశంలోనో కాక ఊళ్లోనే ఇచ్చుకున్నాం. అదే తనివి అనుకుంటే అది మాత్రం పున్నానికో, అమవాస్యకో తొంగి చూడ్డం, వొంగి వాల్డం అంటూ ఏమేనా ఉన్నాదా? దానికి తెల్లారగట్ట ఐదింటినించీ రాత్తిరి తొమ్మిద్దాకా టిక్కూ టిక్కూమని వొడగళ్లవాళ్లాగ చప్పుడు చేయించుకోడంతోటే దినం తీరిపోతుందిట, పాపం".

'బతుకులో ఇరుకు తగ్గడానికి ఇప్పుడందరూ కష్టపడక తప్పడం లేదు. విసుక్కుంటే ఎలాగ?'

"నేను విసుకున్నానట్ట! అవ్వవ్వ! ఎంత మాటనీసేరండీ! గేపకం తెచ్చుగోండి. నేను మీ ఇంట్లో అడుగు పెట్టీసరికి - కుడికాలు పెట్టేనో, యడంకాలు పెట్టేనో సమంగా చూడకముందే నాకు ఇల్లప్ప చెప్పీసేరు. అప్పటికింకా మీ నాయనమ్మగారు బతికే ఉన్నారు. ఉండకూడదని నేనన్లం లేద్స్మండీ. ఎందుకొచ్చిన పాపం మాట్లు! మీ నాయనమ్మగారూ, మీ నాన్నగారూ, మీ అమ్మా, మీ తమ్ముడూ, మీ చెల్లీ, మీరూ, మీ పిల్లలూ, ఆఖరికి మీ మనవరాలూ, మనవడూ కూడాను. మొత్తం ఎన్ని తరాలైందిటా? ఐదు తరాలవాళ్లు నాచేత చాకిరీ చేయించుకుంటే కూడా ఒక్కనాడు నేను విసుక్కోలేదూ, అలిసిపోయేనని మీతో అన్లేదు. ఎందుకో మీరెప్పుడేనా ఆలోచించేరా?"

"లేదులే. ఎందుకు?"

"మీ మీద ఆపేక్ష చేతా, మీరు నామీద చూపించిన దయచేతా-అంతే! అదేదో శ్లోకం చేప్పేరు చూడండీ - యద్యత్ కర్మ కరోమీ, తత్తదఖిలమ్ శంభో తవారాధనమ్మని- అలాగ, దినస్తమానం మీ వాళ్లందరికీ మీకే అనుకుని సంరక్షణ చేసి అమిర్చిపెట్టి అలిసిపోతే; మీ వేళకి మీకేం చెయ్యడానికి నా కోపిక లేకపోయిందన్న సంగతి మీరు నా నాడి చూడకుండా నా కళ్లు చూసి కనిపెట్టేసేవారు. అంత మీరుంటేనూ అలాంటి మీరుంటేనూ ఇంకేమిటంటాను? ఇప్పుడేనా ఇదేదో తమ్ముడు ఇలా రాయడం నించిగానీ, నాకు మీరు, మీకు నేనుగా మనిద్దరం కొన్నాళ్లు విడిగా ఉండాలని నేనిప్పుడేనా అన్లేకపోయిదాన్నేకదా. మళ్లీ మీరు నన్ను పక్కని కూచోబెట్టుకుని రుక్మిణీ కల్యాణం, గజేంద్రమోక్షం, అంబరీషోపాఖ్యానం, సత్యభామా పరిణయం, పాండురంగ మహత్యం, గీతగోవిందం, తరంగాలూ, సాక్షి లెచ్చర్లూ, కీచక వధా చదివి అర్థాలు చెప్పి నన్ను లాలించాలని కోరుకోడం తప్పంటారా?"

"పల్లెటూరికి వెళ్లిపోతే వెళ్లిపోవొచ్చుగానీ అక్కడేమీ ఉండవేమో మాణీ.."

"ఉండవు. ఇక్కడున్నవి చాలా ఉండవక్కడ. ఈ చప్పుళ్లూ, కంపులూ, స్ట్రయికులూ, కరువులూ, అధికార్ల జులుములూ, రాచకీయాల వాళ్ల బందులూ, కర్ఫ్యూలూ, ఆర్మీ విన్యాసాలూ, ఈ చెత్త రోడ్లూ ఇవేవీ ఉండవక్కడ. ఏం చేస్తాం, భరించాలి ఎలాగోలాగ."

నేను నవ్వేను.

"అబ్బ! ఎన్నాళ్లకి చూసేనండీ అంత నవ్వు ఆ మొహంలో!" అంది మాణిక్యం.

మా మామగారు చివరి రోజుల్లో ఆరునెలలపాటు అనారోగ్యంతో బాధపడ్డారు. కొడుకు ఢిల్లీలో ఎక్కడో దూరంగా ఉన్నా కూతుళ్లు ముగ్గురూ మరీ కూతవేటు దూరంలో కాకపోయినా పూట ప్రయాణపు దూరంలోపలే ఉన్నారు. ఐనా ఆయన ముప్ఫయి మైళ్ళలో ఉన్న మా ఇంటికిక్కూడా రాలేదు. ఉన్న ఆరు గదుల్లో రెండు గదులు ఊళ్లో స్కూల్లో పనిచేస్తున్న తెలుగు మేష్టారుకి అద్దె

లేకుండా ఇచ్చి మాటసాయానికి పెట్టుకున్నారు. ఆ మేష్టారు రోడ్డుమీదున్న ధాన్యంమిల్లు కొచ్చి; 'మీ మామగారికి మరీ బాగులేదండీ' అంటూ ఫోన్ చేసి చెబితే మేం టాక్సీ వేసుకెళ్ళి ఆయన్ని ఆస్పత్రికి తీసుకొచ్చేం. ఆయన పోయేసరికి పెరట్లో ఒక ఆవూ, ఒక గేదే ఉండేవి. ఆవుని ఆ మేష్టారికి దానం ఇచ్చేసేడు విశ్వనాథం. గేదెని అమ్మేకండి బాబో అని పైడితల్లిగాడు కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. "రోజూ రెండు పూట్లా దానికి మేతా, సంరక్షణా చూసుకుంటూపాలు పితుక్కుని అమ్ముకో ఒరే. పెయ్య పెద్దదౌతున్నాది. దాన్ని కూడా నువ్వే చూసుకో. ఈ గడప మాత్రం వొదలకు. ఏ రాత్రికేనా ఒచ్చి రోజూ ఇక్కడే పడుకుంటూ ఉండు. పెద్దయ్యగారు పోయేరు కదాని ఇల్లు పాడు పెట్టీకు వెధవా..." అంది మాణిక్యం.

ఇప్పుడది కొంత పనికొచ్చింది. కరెంటు రావడంవల్ల టీవీ, ఫ్రిజ్, ఫాన్లూ, నీళ్ల మోటార్లు వొచ్చి సౌఖ్యాలూ, సదుపాయాలూ సాధ్యపడ్డాయి.

పైడితల్లిగాడూ, అంకమ్మా కాంపౌండుగోడని అనుసరించి వున్న పశువుల పాకపక్కని ఓ పాక వేసుకుని అక్కడే చేరిపోయేరు. ముందు హాల్లో మేష్టారు సాయింకాలాలప్పుడు జనాల్ని పోగేసి పురాణం చెబుతున్నారు. కూరల పెరడుకీ, పువ్వుల మొక్కలకీ విధాయకంగా నీళ్లు పోస్తున్నారు.

మాణిక్యం నన్ను తీసుకొని అక్కడి కెళ్లడం ఈ ముప్ఫయ్యారేళ్లలో ఇది ఆరోసారి అని నాకు లెక్క తేలింది. ఎప్పుడూ కూడా ఇలాగ "అమ్మా మహాలక్ష్మి దయచేయవమ్మా మమ్మూ మా పల్లే పాలింపవమ్మా!" అని అదేదో పాత సినిమాలో పట్టినట్టు మాణిక్యానికి జనం నీరాజనం పట్టడం చూళ్లేదు నేను.

✤ ✤ ✤

ఆరు నెలలయ్యేసరికి మా సంభాషణలు పూర్తిగా మారిపోయేయి.

"చలేస్తోంది మాణీ, ఊలు బనీను వేసుకుందామంటే కనబడ దెక్కడుందోను."

"భోషాణప్పెట్లో ఉన్నాది. తాళమేమోనూ, పడమట గదిలో తలుపు వెనకాతల మేకునున్నాది. తాళం బరువు. జాగర్త, కాలుమీదెత్తీసుకోగల్రు."

✤ ✤ ✤

"నిన్నటి నుంచీ చూస్తున్నాను. అన్నం ఎర్రగా ఏదో కొత్తగా ఉంటోందేమీ?"

"ధాన్యం మిల్లు పాడైపోయిందిట. దంపించిన బియ్యం ఒండుతున్నాను. సొక్కలేదేమిటి? ఒంటికి మంచిది గానీ, పేచీలు మానీసి తినీయండి."

✤ ✤ ✤

"ఇదేమిటి ఈ మూల బస్తా? అమ్మబాబోయ్, పంచదార బస్తాడెందుకే?"

"నేనేం కొనాలని కొన్నానా? నిన్న చెరుకంతా మిల్లుకి తోలేడు పైడితల్లిగాడు. డబ్బుకి పదిహేను రోజుల తరవాత రమ్మన్నాట్ట మేనేజరు. ఈ వెధవ జిడ్డులా పట్టుకున్నాడనీ, పోనీ అందాకా ఓ బస్తా పంచదార వేసుకో అని బండెక్కించేట్ట. చుట్టూరా చీమల మందు జల్లించాను. అది చూసుకోకుండా పంచదారే వొలికి పోయిందనుకొని బస్తాలోకి గానీ ఎత్తీగల్రు!"

✤ ✤ ✤

"ఇదేమిటీ దోసె ఇంత దళసరిగా ఉంది?"

"దోశా, నామొహమా? దాన్ని చల్లపొంగరం అంటారు. అటుకులు నానేసి పులీ బెట్టి చేస్తాం. మొన్న దిబ్బ రొట్టి చేసేను. నిన్న పోలిరొట్టి అయింది. ఇవాళ మరోటేదేనా చేదామనిపించి..."

"కొత్త కొత్త వంటలన్నీ నేరుస్తున్నావే."

"ఇవి కొత్తవేం కావు. అనాదినించీ పల్లెపట్టునున్నవే. పట్నాలు చేరి టమాటా బాతులూ, పేపరు మసాలా దోసెలూ మరిగి ఇవన్నీ మరిచి పోయేరు, మీరేనూ. ఇంకోతరం మారితే చిప్సులూ, గోల్డు ఫింగర్లూ మరిగి చేగోడీలూ జంతికలూ, సొజ్జప్పాలూ కూడా మర్చి పోతారు. అల్లప్పచ్చడి నంచుకుంటారా, ఊరుబిండి వేసేదా?"

"కారప్పొడీ నెయ్యీ తే."

"నెయ్యి నిండుకున్నాది. నిన్ననెవళ్లో పట్నం వెళ్తూ వుంటేనూ, అమ్మాయికి వేవిళ్లుకదాని మినప సున్ని కట్టి ఇచ్చేసేను. మళ్లీ మూడ్రోజుల్దాకా నెయ్యడక్కండి. నాకు లేదన్డం చికాకు! అంతగా ఉండలేననుకుంటే ఇవాళ తీసిన వెన్న రేపు మీ మట్టుకి కాస్తాను... కానివ్వండి."

✤ ✤ ✤

"ఏమిటి, ఇల్లంతా ఈ వాసన?"

"ఏం, ఈ సంపెంగ కంపు తమరి కింపుగా లేదేమిటి? మళ్లీ చెంపకపుష్ప సుగంధవాసినీ అంటూ కవిత్వాలు చదూతారు... ఏం లేదు; చెట్టు విరగా పూసీసిందని దింపించీసేను. పంచినన్ని ఇరుక్కీ పొరుక్కీ పంచగా మిగిల్నివి గదులన్నిట్లోనూ తలో గుప్పెడూ పెట్టేను. ఓడోనిల్లు అంటారే, అలాగ!"

✤ ✤ ✤

"ఇదేమిటీ, పెసరట్టు వేస్తానని ఇదేదో పెట్టేవు?"

"అది పెసరట్టేనండీ బాబూ, పొట్టు పెసలు నానేసి రుబ్బించి నేత్తో వేసేను. పెసరపప్పురంగు కనిపించకపోతే పోయింది. అల్లం, జీలకర్రా కూడా ఆనలేదా, కళ్లకి?"

✤ ✤ ✤

"రెవిన్యూ ఇనస్పెక్టరు ఊళ్లోకి కేంపొచ్చేట్ట. నన్ను చూద్దామనొచ్చేడు, మనింటికి. అప్పుడెప్పుడో నాదగ్గిర పనిచేసేడులే. తిండానికేమేనా పెట్టగలవా, ఒట్టి కాఫీ ఇచ్చేసి పమ్మించీద్దామా?"

"రస్కోరావుండలూ, చక్కిలాలూ ఇందాక ఎండవేళప్పుడు చేయించిన వున్నాయి. తింటాడేమో పెట్టి చూడండి. షోక్కి పోతే చెప్పలేం గానీః తిన్నాడా - వారానికోమాటు నోరూరించుకుంటూ దారి అడక్కుండా తిన్నగా ఒచ్చీడం ఖాయం."

✤ ✤ ✤

"ఇంకా తెమల్లేదూ? పదండలా పెద్ద చెరువు గట్టుదాకా నడిచొద్దామంటేను!"

'ఒళ్లు బరువుగా ఉంది మాణీ. రోజూ వెళ్తూనే ఉన్నాం కదా. పోనీ ఇవాళకి మానేస్తే ఏం?'

"బరువూలేదు, బద్ధకం లేదు. పదండి, పదండి! పొద్దస్తమానం తిని కూచోడంన్నించే ఆ బరువు. చక్కగా రొండు మైళ్లు నడిచొచ్చి నూతిలోంచి పది బాల్చీల నీళ్లు తోడుకుని స్నానం చేస్తేనే

ఆ బరువు తగ్గడం. ఒచ్చీ వయస్సా పోయీ వయస్సా?''

✣ ✣ ✣

“అన్నీ బాగానే ఉన్నాయిగాని, మాణీ! చప్పుడూ, ధూళీ, కంపూ లేని ఈ గాలీ, తరిపి గేదె పాలతో చేసిన ఈ కాఫీ, వయసుని మరిపించి జిహ్వని లేవగొట్టే ఈ పిండివంటలూ, తాటిముంజెలూ, కొబ్బరి గుజ్జూ; సంపెంగా, మల్లీ, జాజీ, చామంతీ ఇచ్చే ఈ వాసనా, ఇచ్చిందెంతైనా చేసిందాంట్లో అపేక్షా, గౌరవం పొదిగి చేసే పనివాళ్ల సేవలూ- ఇవన్నీ పిల్లలకి అందడం లేదని ఇదిగా ఉందే!''

“వాళ్లు ఇవన్నీ టీవీలో చూసి సంతోషిస్తార్లేద్దురూ! అన్నట్టు టీవీ అంటే గేపకం ఒచ్చింది. పేటలో మంచి పాతసినీమా వేస్తున్నారుట; బండి పుయ్యమని పైడితల్లి గాడికి చెప్పేను; వేగిరం తయారవండి!''

*(‘ ఇండియా టుడే ’ - పక్షపత్రిక - 21-1-1991 )*

*With best Compliments From*

**CHANDRA MOULI BROTHERS**

**DEPARTMENTAL STORES**

KALINGA ROAD
**SRIKAKULAM - 532 001**

with best Compliments from:

# VAMSHADHARA PAPER MILLS LTD.,

**Manufacturers of Quality MF Plain Kraft Paper for Corrugating Industries.**

*Admn. Office :*

Post Box No: 50
Ramalaxmana Theatre Jn.
Srikakulam-532 001 (A.P.)
Phone:22242 & 22002
Grams : "PAPER"

*

*Corporate Office :*

Plot No. A-35
Road No. 6, Film Nagar
Jubilee Hills, Hyderabad-500 033 (A.P.)
Phone : 244305 & 215773

*

*Regd. Offcie & Mills*

Madapam post & Village
Narasannapeta Mandal
Pin : 533 422
Srikakulam Dist (A.P.)
Ph : 82132, 82138, 82151